# సినిక్ మగడు

అతడు మంచి చదువుకున్నవాడు. కవి. యువకుడు. కాని సినిక్! మంచిలో చెడ్డ, చెడ్డలో మంచి, ఉంటుందన్న సంగతి యెరుగునుకాని, దేనియందైనా మున్ముందు చెడ్డనే వెదకడానికి సిద్ధపడేవాడు. మేలెంచక కీడెంచడమే అతని నైజం! కాబట్టి తరుచుగా అతనికీ, భార్యకూ చిత్రమైన వాగ్వాదాలు వస్తూఉండేవి.

తనలో ఉండే మంచిని సహితం ప్రకటించుకునేందుకు యిష్టపడేవాడు కాడతడు! కాని నిజంగా చాలా యోగ్యుడు.

మొగుడితత్వం బాగా తెలుసును గనుక, అతని మాట లెంత విపరీతంగా వినవచ్చినా ఆమె ఎన్నడూ కోపగించుకునేది కాదు. నవ్వుతూ భర్తను అప్పుడప్పుడు మందలించేది, సరసంగా. ఆమె ముఖం ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉండేది. మనిషికూడా సాగసరి. కించత్ పెంకెది. తెలివైన పిల్ల. మొత్తానికి ఆమెకు జీవిత మొకమధురమైన స్వప్నంవలె ఆనందమయంగా తోచేది, ఎల్లప్పుడూ.

దంపతులకు ఒకరియెడల ఒకరికి ఎంతో ప్రేమ. వాళ్ళ ప్రథమసంతానం ఒక కొడుకు. ఇద్దరికీ ఆ పిల్లడంటే ప్రాణం! అబ్బాయిని ఒడిలో తీసుకొని, గొమ్ముకు అదుముకుంటూ వాడిమీద వెర్రిప్రేమ కురిపించేది తల్లి; సముద్రం కెరటాలవలె హృదయంలో అతనికి ఎంతప్రేమ పొంగుకొచ్చినా, ఆమెవలె వెర్రులొడ్డేవాడుకాడు తండ్రి!

ఒకనాటి ముచ్చట యిది. తీరుబడిగా వాలుకుర్చీలో కాళ్ళుచాచి కూచుని, ఏదో యింగ్లీషుపుస్తకం చదువుకుంటున్నాడాయన. పిల్లవాడినెత్తుకొని ఎగరవేస్తూ, వాడిబొజ్జ నదిమి ముద్దాడి కితకితలు పెడుతూ, కిలకిల నవ్వుకుంటూ, ఆడుతూ వచ్చిం దామె.

భార్య

(ఉత్సాహంతో బిడ్డను యెత్తి చూపుతూ) చూశారా, మన అబ్బాయికి చిన్న ఎలకపళ్ళు వస్తున్నాయి!

భర్త

(చదువుతున్న పుస్తకంనుండి తలైనా యెత్తక) అట్లాగా?

భార్య

మీకు ఒక్కపిసరైనా ఆశ్చర్యంకాని, సంతోషం కాని కలిగినట్లులేదు!

భర్త

(తలయెత్తి, చిరునవ్వుతో మాతాశిశువులను అట్టే చూస్తూ) ఓసి వెర్రిదానా! పిల్లడు పళ్ళుచేస్తే అందులో ఆశ్చర్యపడవలసినది ఏమున్నది గనక? పిల్లలందరికీ వస్తాయి పళ్ళు. అట్లాగే మన అబ్బాయికి కూడా వచ్చాయి. లోకంలోని అందరు పిల్లలవలె గాక, ఎన్నాళ్ళకూ మనవాడికి నోట్లో పళ్ళు మొలవకనే పోతే, అప్పుడు నిజంగా ఆశ్చర్యపడవలసినదే!

భార్య

చాలులెండి మీ అడ్డువాదన. ఎప్పుడూ యింతే! ...మీరేమో ముచ్చట పడతారనుకొని,—

భర్త

పిల్లవాడికి పళ్ళువస్తే ముచ్చటపడమన్నావా నన్ను? సౌఖ్యప్రదమైన విషయాలకు ముచ్చటపడడం సబబు. ఆఫీసువేళ దాటకుండా రోజూ నువ్వింత వండిపెట్టగలిగితే నేను ముచ్చటపడాలి! జరుపులు పెట్టకుండా, గునియాకుండా నువ్వు కోరినప్పుడల్లా నీకు నేను చీరలు, నగలు కొని యిస్తూఉంటే, నువ్వు ముచ్చటపడాలి! అంతేకాని,—

భార్య

మీతో వాదించి యేం లాభం?

భర్త

(నవ్వుతూ) నిజానికి మన అబ్బాయి పళ్ళుచేసినందుకుగాను, మనం ఉభయులమూ ఎంతో సానుభూతి చూపవలసి ఉంటుంది!

భార్య

సానుభూతెందుకు పైపెచ్చు?

భర్త

ఎందుకా? కుఱ్ఱవాడికి పళ్ళువస్తున్నాయంటే, మున్ముందు జరగబోయే దుఃఖమయగాధకు తొలిప్రకరణం ప్రారంభమైన దన్నమాట. ఇప్పుడు బియ్యపుగింజలవలె ఒకటో రెండో సన్నని పాలపళ్ళు మొలచి ఉంటాయి. క్రమంగా పైని, క్రిందను, చిన్నవి, పెద్దవి, కోరలు, దంతాలు, అన్ని రకాల పళ్ళూ మొలుచుకొస్తాయి.

భార్య

అయితే?

భర్త

ఒక్కొక్క పన్ను మొల్చినప్పుడల్లా పాపం అబ్బాయి కొంతబాధను ఓర్చుకోవలసి ఉంటుంది కదా? ఇక లోపలిదంతాలు మొలచినప్పుడు చంటిపిల్లలకు సర్వసాధారణంగా జబ్బుచేసి తీరుతుంది. జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి, చెవిపోటు మొదలైన పాడువ్యాధులన్నీ అంకురిస్తాయి. అప్పుడు మాతాశిశువులకే గాక, యింట్లో ఎవరికీ కంటినిండా నిద్ర అనేది ఉండదు! క్రొత్తగా పళ్లుచేసిన పిల్లలకు అప్పుడప్పుడు దవిసలుపెక్క కాబోలు, ఏదైనా కొరకాలని ఉంటుంది. తల్లిపాలు త్రాగుతున్నప్పుడు చనుమొనలు కొరకడం ప్రారంభిస్తారు మొదట. ఒక్కొక్కప్పుడు అట్లా కొరకబడిన స్తనాలు వాచిపోయి, పుండుచేసి, సలుపు పోటు పెట్టి, తల్లిని మంచం ఎక్కిస్తాయి. పాలు త్రాగుతూ శ్రీకృష్ణుడు చన్ను కొరికేస్తే, పాపం పూతన యేనుగువంటి మనిషి అయికూడా గుక్కెడునీళ్లు అడగకుండా చచ్చిపోయిందట!

పిల్లల పళ్ళతీపు తల్లిపాలు కొరకడంతో తీరక, క్రమంగా ఒంటిమీది చొక్కాలు, ఆడుకునే రబ్బరు బొమ్మలు, చేతివేళ్ళు, మొదలైన వాటిమీద పడుతుంది. ఈ విధంగా చిన్నప్పుడు అన్నీ కొరకటం బాగా అలవాటైన కొందరికి పెద్దయిన పిమ్మటకూడా ఆ వ్యసనం పూర్తిగా వదలదు. గోళ్ళు, కలాలు, మీసాలు కొరుక్కుంటూ ఉంటారు కొందరు పెద్దమనుషులు! దంపతులు ప్రేమోద్రేకంతో ఒండొరుల బుగ్గలు, పెదవులు గంట్లుపడి, రక్తాలొచ్చేటట్లు కొరుక్కుంటారని చెప్తారు మనకవులు. కరటకశాస్త్రి చెప్పినట్లు 'శ్రీకృష్ణమూర్తివారు రాధికతో శలవిస్తున్నారు: ఓరాధికా, నీకోపం తీర్చుకోవాలన్నట్టాయినా,

'ఘటయ భుజ బంధనం
రచయ రద ఖండనం,
యేన వా భవతి సుఖజాలం.

అనగా యేమంటున్నాడంటే కవీశ్వరుడు, చేతుల్తోటి ఉక్కిరి బిక్కిరి అయ్యేటట్టుగా కౌగలించుకో; మరిన్నీ పెదిమలు రక్తాలొచ్చేట్టు కొరికెయ్యి, అంటున్నాడు."

భార్య

(నవ్వుతూ) కొరికిందా రాధ?

భర్త

రాధ నీఅంత పెంకెదికాదు.

భార్య

అలాగా? ఒట్టి సత్తెకాలపుపిల్ల కాబోలు!

భర్త

(నవ్వి)...... కొందఱు చిన్నపిల్లలకు యీ కొరకడం అలవాటు మహాదారుణంగా పరిణమిస్తుంది చివరకి. మేకులు, సీసాలు, పైసాలు, తాళంచెవులు, పిన్నులు, చాకులు, చెమ్చాలు, అన్నీ కొరుకుతా మంటారు. ఒక్కొక్కప్పుడు ప్రాణాపాయం కలిగే ప్రమాదాలుకూడా సంభవించడం కద్దు. మృతకళేబరాలు కోసేటప్పుడు కొందరి కడుపులలో గాజుపెంకులు, చిల్లరడబ్బులు, మేకులు ప్రత్యక్షమవుతూ ఉంటాయని చెప్తారు డాక్టర్లు. పిల్లలు పిల్లలతో ఆడుకునేటప్పుడు వాళ్ళలోవాళ్ళు తగవులాడుకొని, ఒకరినొకరు పళ్ళునాటేటట్లు కరుచుకుంటారు. మనిషికాటుకి మందు లేదని సామితె చెప్తారు మనవాళ్ళు!

బాల్యావస్థలో కొరకడం అలవాటైన పిల్లలకు కొంచెం జ్ఞానంవచ్చిన పిమ్మట ఆపళ్ళతీపు చిరుతిండిమీదికి పోతుంది. పచ్చి జామికాయలు, పండిన బాదంకాయలు, తాటిపళ్ళు, కొబ్బరికాయలు, చెరుకు ముక్కలు, వేరుసెనగలు, బఠాణీలు, వేచిన కందిపప్పు, జంతికలు, చక్కిలాలు, చేగోడీలు, వడియాలు, మొద

లైన గట్టి పదార్థాలు తినడానికి ఇష్టంగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు అట్టి తిళ్ళు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఒకప్పుడు పళ్ళు విరిగిపోవచ్చును. నాలుక కత్తిరింపబడవచ్చును. గొంతుకలో ఏదైనా యిరుకుకొని ప్రాణహాని సంభవించవచ్చును. ఇట్టి విపరీతాలేవీ తటస్థించక పోయినా, అట్టి చిరితిండి దేహారోగ్యాన్ని మట్టుకు తప్పకుండా పాడుచేస్తుంది. అజీర్తి, కడుపునొప్పి, వాంతులు, కలరా, మొదలైన రోగాలు రావడానికి యిట్టి తిళ్ళే మూలకారణాలు!

ఇన్ని యిబ్బందులకూ హేతుభూతాలైన పళ్లు మొలచినవి మొలచినట్లుగానే అందంగా, చిన్నవిగా, తెల్లగా, శుభ్రంగా ఉంటాయేమో అంటే, అదీలేదు. బాల్యావస్థలోనే అన్నీ ఊడిపోయో, విరిగిపోయో, మళ్ళీ నొప్పిచేస్తాయి. అంతటితోనైనా శని విరగడైతే బాగుండును. కాని వాటిస్థానే క్రొత్తపళ్ళు మొలుచుకొస్తాయి. ఇవి కొంచెం పెద్దవిగాను, వంకరటింకరగాను, ఎడఎడంగాను, సొట్టవిగాను, వికృతంగాను మొలవడం తరుచు. కొందరికి దొంతరపళ్లు, పారపళ్లు మొలుస్తాయి. ముఖం అంతా అందహీనమవుతుంది. పెదవులు మూతపడవు. ఇంకా కొందరు దురదృష్టవంతులకు మీదిపళ్ళు నూటిగా ముక్కులో నుండి తోసుకొవస్తాయి, పై పెదవెను చీల్చివేసి. అప్పుడు ముఖానికి నిజంగా రాక్షసిరూపు వస్తుంది.

భార్య

ఎట్టిరూపు దేనికివస్తుందో మానుతుందోకాని, యిప్పుడు మీవర్ణనను వస్తూవుంది రాక్షసిరూపు! ఇక చాలించండి మీ పుణ్యముంటుంది:

భర్త

కొసాహూ వినుమరి. పళ్ళమూలాన ఎన్నెన్ని అనర్థాలు ఉన్నాయో నీచేతనే వొప్పిస్తానుగా?

పళ్లు అందంగా ఉన్నా, అష్టవక్రంగా ఉన్నా, వాటికి చెయ్యవలసిన చాకరీలో ఏమీ లోటు ఉండకూడదు కదా? ఇంట్లో శవంపోయినాసరే, పళ్ళుతోముకోవడం మాత్రం తప్పదు! అరవవాళ్ళయినా నాలిక గీసుకోవడం మానివేయగలరు కాని, కేవలం పళ్ళుతోముకోవడమే మానివేయలేరు. మన నవీననాగరికులైనా సంధ్యావందనం, శైవప్రార్థన మొదలైనవంటే విసర్జించగలరుకాని, యింకా దంతధావన కర్మను విడిచిపెట్టడానికి సాహసించలేకుండా ఉన్నారు! పుడకో, కుంచో, పౌడరో, పేస్టో, ఏదో ఉపయోగించి, ప్రతిమనిషీ పళ్ళుతోముకొని తీరవలసినదే! లేకుంటే ఆప్తబంధువులు సహితం దూరంగా జరుగుతారు. అసహ్యించుకుంటారు. తిడతారు. అందుకనే, శుభకార్యాలలోను, సభలలోను, పదిమందీ చేరి ఒకచోట కూచోవలసి వచ్చినప్పుడు మనవాళ్ళొక మంచి లాంఛనాన్ని పాటిస్తూ ఉంటారు. అత్తరు, పన్నీరు వంటి సుగంధద్రవ్యాలు సభాసదుల మీదజల్లి చందన తాంబూలాలు అర్పిస్తారు. ఉద్దేశమేమిటీ అంటే, ఒకరి నోటికంపు, చెమటకంపు, దగ్గిరనున్న రెండో వాళ్ళను బాధించకుండా ఉండగలందులకు! ఈ విషయంలో నరుడికంటె పిట్టలు, జంతువులు నయం. పశువులకు పళ్ళే ఉండవు! జంతువులు పళ్ళుతోముకోక పోయినా, నోరు శుభ్రంగానే ఉంచుకోగలవు. నోరే అన్నమాటేమిటి? శరీరం యావత్తూ సనకంటె శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోగలవు. సృష్టిలోని జీవరాసులన్నిటిలోను అందగాడిననీ, తెలివైనవాడిననీ గర్వించే మానవుడుమాత్రం అన్నివిధాలా కల్మషపూరితుడు; దుర్గంధసుయుడు!

పళ్ళయెడల ఎంతో శ్రద్ధతీసుకొని ఎన్నివిధాల అవస్థపడినా, మానవుడు అప్పుడప్పుడు దంతరోగాలకు గురి అవుతూనే ఉంటాడు. 'పయోరియా' జబ్బు అనుభవించే వాడికేగాక, యెదటివాళ్ళకు కూడా ప్రాణసంకటంగా ఉంటుంది! ఇక పుప్పిపళ్ళబాధ అనుభవించేవాడికీ, దేవుడికే తెలియాలి. ఆబాధకు ఎంతటివాడికీ అప్రయత్నంగా నోటివెంట బూతులు వస్తాయి. దేవుడిమీద నమ్మకం పోతుంది. ప్రేమించేవారి యెడల విరక్తి పుడుతుంది. డాక్టరుచేత పళ్ళు ఊడదీయించుకునేదాకా నిద్రాహారాలు ఉండవు.

ఇక చిగుళ్ళు వాచిపోవడం, పళ్ళంట రక్తంకారడం, పళ్ళు కదుల్తూ ఏదీ నమలనియ్యక పోవడం, యిత్యాది

జబ్బు లెన్నో వస్తూఉంటాయి, గ్రహచారం చాలని వాళ్ళకు. దంతవైద్యులు యిల్లు గుల్లచేస్తారు. పళ్ళు తెల్లగాతోమి శుభ్రపరచడానికే పదిరూపాయి లడుగుతాడు డెంటిస్టు! లేని వ్యాధులు ఉన్నవనిచెప్పి బెదిరించి, డబ్బులాగడానికి ప్రయత్నిస్తాడు కూడా! ఉన్న పళ్ళు ఆరోగ్యంగా లేవని ఊడదీయించుకో మంటాడు. బోసినోటి ముసలివాళ్ళను పళ్ళుకట్టించుకోమని బలవంతం చేస్తాడు. ఒక్కొక్కపన్ను పీకివేయడానికి రెండు మొదలు ఐదురూపాయిల వరకూ ఛార్జి అడుగుతాడు. అట్టే బిగపట్టి బేరంచేస్తే, ఆకోపం పళ్ళు ఊడదీసేటప్పుడు తీర్చుకుంటాడు. క్రొత్తపళ్ళు అమర్చడానికి 'సెట్'కి వందరూపాయి లడుగుతాడు! ఇంతా కట్టించుకుంటే, ఒక్కొక్కప్పుడు నోటి కొలతలు తిన్నగా కుదరక, ఆపళ్ళతో నానాబాధలూ పడవలసి వస్తుంది. నోరునొప్పి చెయ్యడం, దవడలు సొట్టపోవడం, మూతి వాచిపోవడం, మొదలైన అనర్థాలెన్నో సంభవిస్తాయి. దేవుడిచ్చిన పళ్ళతో అంటే, ఎప్పుడో గ్రహచారం చాలనప్పుడు తప్ప, నొప్పితో బాధపడవలసిన అగత్యం లేదు. కాని కట్టించుకున్న పళ్ళతో అనునిత్యమూ అవస్థపడక తీరదు! ఉదయమే వాటినితోమి, 'లోషన్'లో కడిగి, జాగ్రత్తగా దవడలకు అమర్చుకోవాలి. రాత్రి నిద్రపోయేటప్పుడు తీసివేసి, కడిగి, జాగ్రత్తపెట్టుకోవాలి. అశ్రద్ధగా ఏ టేబిలుమీదనో, గూట్లోనో దాచితే ఎలకలో, పిల్లులో ఎత్తుకొపోతాయి!

పళ్ళనుగూర్చి నరుడు తన జీవితపరిణామమందు యిన్ని అవస్థలు పడవలసి ఉండగా, అబ్బాయి పళ్ళు చేస్తున్నాడని సంబరపడమంటావు కదా, ఏమనుకోవాలి నేను?

భార్య

శుభం కోరవోయి పెళ్ళికొడకా అంటే, వెనకటికో బుద్ధిమంతుడు ఏదో అన్నాడట లెండి! అట్లా ఉంది మీ వరస! ఎప్పుడూ అపశకునం మాటలు, ఓగాయిత్యం కబుర్లు,—

భర్త

నిజం అట్లానే ఉంటుంది మరి, వెగటుగా!

భార్య

అయితే ఆవెగటుగా, అసహ్యంగా ఉండే నిజాన్ని పలికి నలుగురినీ నొవ్వజేసి, వాళ్లచేత నిష్ఠూరాలు పడేకన్న, తియ్యతియ్యని అబద్ధాలే చెప్పి, అందర్నీ సంతోషపరచి మెప్పు పొందరాదూ?

భర్త

అది మీ ఆడవాళ్లకే చెల్లింది!

భార్య

(ముసిముసినవ్వుతో తల తమాషాగా పంకిస్తూ)
కవులకుమాత్రం చెల్లదూ?

—తాత కృష్ణమూర్తి, బి.ఏ., యల్.టి.

## కోరిక

వికసించియున్న నాకు శోభనిచ్చుటకయి, మధుకరుడు నాయొద్ద నాట్యము సేయ......... నేను కోరను.

నవవయస్విను లమనము లాకర్షించి, వారికరములజొచ్చి, వారి స్నేహము జూరగొన నే కాంక్షింపను.

నీచరణసరోజసాన్నిధ్యమున పూజింపంబడి, వాడిపోయి, ముక్తిబొందనూ............ నేను యాచింపను.

"మాతృదేవీ బలిమంటపమందు యజ్ఞపశువుగ నిలుచు" నాత్మసమర్పకులగు త్యాగవీరుల శోణితప్రవాహమునఁ దడుపంబడిన దివ్యపథమునందు రేకలుచిదిమిన పూవునై సంచరింప నాకు వరముదయసేయుము, దేవా!....

—చిట్టూరి సత్యనారాయణ.